క్లుప్తంగా

అగస్త్యేశ్వరునికి పూజలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో గురువారం మాస శివ రాత్రి సందర్భంగా అగస్త్యేశ్వరునికి తెల్లవారుజామున రుద్రాభిషేకం, రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించి సుందరంగా అలంకరించారు. ఉదయం 7 గంటలకు గణపతి, నవగ్రహ, రుద్ర హోమాలను వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. సాయంత్రం గంగాగౌరి సమేత అగస్త్యేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ వేదికపై ఆశీనులను చేసి కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఆలయ ఈఓ, దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శంకర్‌బాలాజీ, భక్తులు పాల్గొన్నారు.

ఈశ్వరీదేవికి శాంతి హోమం

పోరుమామిళ్ల : మండలంలోని పెద్ద కప్పలపల్లెలో గురువారం ఈశ్వరీదేవికి శాంతి హోమం నిర్వహించారు. వారం రోజుల్లో ఆ గ్రామంలో కోట పోలేరమ్మ జాతర జరగనుంది. ఈ నేపథ్యంలో ముందుగా ఈశ్వరమ్మకు శాంతి హోమం చేయడం ఆనవాయితీగా వస్తోంది.

అన్నదానం

పోరుమామిళ్ల: శ్రీ జ్ఞాన సరస్వతీదేవి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు శ్రీనివాసులు ఇచ్చిన పిలుపునకు స్పందించి కొరివి రామమోహన్‌రెడ్డి తన కూతురు జోశ్వికరెడ్డి పుట్టిన రోజు సందర్భంగా గురువారం బాలమ్మసత్రం వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

ట్యాంకర్‌తో ఉచితంగా నీటి సరఫరా

పోరుమామిళ్ల : మండలంలోని తిమ్మారెడ్డిపల్లె పంచాయతీ పెద్దకప్పలపల్లెలో వారం నుంచి నీరు రావడం లేదు. ప్రజల ఇబ్బందులను గమనించి గ్రామానికి చెందిన కప్పల నాగేష్ ట్యాంకర్‌తో రెండు రోజులుగా నీరు అందిస్తున్నాడు. దీంతో గ్రామస్తులు అతనికి కృతజ్ఞతలు తెలిపారు. కాగా అధికారులు మరో బోరు వేసి తమకు నీటి ఇబ్బంది లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

23 నుంచి కోదండరామ స్వామి విగ్రహ ప్రతిష్ట

బి.కోడూరు : మండలంలోని ఆనంవారిపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీకోదండరామస్వామి దేవాలయంలో ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు కోదండరామస్వామి నూతన విగ్రహ ప్రతిష్ట, కుంభాభిషేక మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. 25వ తేదీ ప్రాతఃకాలపూజ, దీక్షాహోమము, యంత్రప్రతిష్ట, విగ్రహప్రతిష్ట, ధ్వజ, శిఖర ప్రతిష్టలు, ప్రాణ ప్రతిష్ట, పూర్ణాహుతి, కుంభాభిషేకంతో పాటు ఉదయం 10 గంటలకు శ్రీసీతారామ కల్యాణం జరుగుతుందన్నారు. 25వ తేదీ బండలాగుడు పోటీలు ఉంటాయన్నారు. మూడు రోజులు అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

25న వాహనాల వేలం

ప్రొద్దుటూరు క్రైం : వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఈ నెల 25న ఉదయం 11 గంటలకు ఏఎస్పీ ప్రేరణాకుమార్ ఆధ్వర్యంలో బహిరంగ వేలం వేయనున్నట్లు వన్‌టౌన్ సీఐ రాజారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పట్టుబడిన వాహనాలకు సంబంధించిన అసలైన యజమానులు ఎవరో తెలియరానందున వేలం వేయడానికి నిర్ణయం తీసుకున్నామన్నారు. ఆర్టీఓ పరీక్షించి సూచించిన ధరల మేరకు వేలం వేయనున్నట్లు తెలిపారు. టాటా 10 టైర్ల లారీ, టాటా సుమో, టాటా సఫారి వాహనాలతో పాటు 17 మోటార్ బైక్‌లను వేలం వేస్తామని చెప్పారు. ఆసక్తి కలిగిన వారు బహిరంగ వేలంలో పాల్గొనాలని సీఐ కోరారు.

ధర్నా కరపత్రాలు విడుదల

ప్రొద్దుటూరు : స్థానిక ప్రొద్దుటూరు తాలూకా పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయం వద్ద గురువారం ఆల్ ఆఫ్ యూ దివ్యాంగుల సేవా సొసైటీ నాయకులు కలెక్టరేట్‌ల వద్ద చేపట్టే ధర్నాకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సొసైటీ రాష్ట్ర కన్వీనర్ అఫ్జల్, గౌరవాధ్యక్షుడు వై.చపలతిరావు మాట్లాడుతూ దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 19 నుంచి 30వ తేదీ వరకు ఉమ్మడి కడప జిల్లాల కలెక్టరేట్‌ల వద్ద ధర్నా చేయనున్నట్లు తెలిపారు. ఈనెల 20న కడప కలెక్టరేట్ వద్ద చేపట్టే ధర్నాలో పెద్ద సంఖ్యలో దివ్యాంగులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఉచిత వడుగులు

మైదుకూరు : పట్టణంలోని షాదీఖానాలో గురువారం 120 మంది ముస్లిం పిల్లలకు ఉచిత వడుగులు చేశారు. ముస్లిం వెల్ఫేర్ ట్రస్టు తరఫున వైఎస్సార్‌సీపీ మైనారిటీ విభాగం జిలా ప్రధాన కార్యదర్శి మదీనా దస్తగిరి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. వడుగులు చేయించుకున్న పిల్లలకు పౌష్టికాహారం, ఒకజత బట్టలు దస్తగిరి, ట్రస్టు సభ్యులు అందజేశారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం

ప్రొద్దుటూరు క్రైం : పర్యావరణాన్ని కాపాడుకుందామని ఫారెస్ట్ రేంజ్ అధికారి హేమాంజలి తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అటవీశాఖ ఆధ్వర్యంలో దర్గా బజార్‌లోని ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. లైఫ్ కార్యక్రమం గురించి ఎఫ్‌ఆర్‌ఓ వివరించారు. భూతాపాన్ని అరికట్టకపోతే రాబోయే రోజుల్లో తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు.

ప్రతి గ్రామంలోనూ అభివృద్ధి, సంక్షేమం

- గ్రామల్లోని సమస్యలను సత్వరమే పరిష్కరించండి
- సోమాపురంలో గడప గడపకు తిరిగిన ఎమ్మెల్యే రఘురామిరెడ్డి



పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

చాపాడు : ప్రతి గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేస్తూ ప్రజలకు సంక్షేమాన్ని అందిస్తోందని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని సోమాపురం, ఆనందాశ్రమం, ఉప్పరకొట్టాలు, సోమాపురం దళితవాడ గ్రామాల్లో గురువారం గడప గడపకు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రఘురామిరెడ్డి ఇంటింటి తిరిగి ప్రజా సమస్యలు, సంక్షేమ పథకాల అమలుపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఉప్పరకొట్టాల గ్రామంలో చేతి పంపును తయారు చేయించి, మంచినీరు పుష్కలంగా అందేలా కుళాయిలను ఏర్పాటు చేయించాలని సూచించారు. ఇదే క్రమంలో పలుచోట్ల నెలకొన్న చిన్న చిన్న సమస్యలను పరిష్కరించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలోనే ప్రభుత్వ ఉద్యోగులు అందుబాటులో ఉంటారని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. గ్రామ సచివాలయంలోనే ప్రజల అవసరాలన్నీ పరిష్కారం అవుతున్నాయని ఎమ్మెల్యేకు ప్రజలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ లక్షుమయ్య, గ్రామ సచివాలయ మండల కన్వీనర్ రామోహన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ బాలనరసింహారెడ్డి, సర్పంచ్ శ్రీనివాసులరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మాజీ సర్పంచ్ రామాంజనేయులరెడ్డి, వెంకటరామిరెడ్డి, సుబ్బరామిరెడ్డి, కొండారెడ్డి, జయరామిరెడ్డి, వీరారెడ్డి, హాజరత్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, రామసుబ్బారెడ్డి, గొడుగు జయరాజు తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని ఉప్పరకొట్టాలకు చెందిన శివకుమార్ అనే విద్యార్థి చక్కెర వ్యాధితో బాధపడుతున్నాడు. ప్రతి రోజూ ఇంజెక్షన్ వేయించుకోవాలని ప్రతి నెలా రూ.10వేలు పైగా ఖర్చు అవుతోందని తమను ఆదుకోవాలని కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన రఘురామిరెడ్డి మెడికల్ బిల్లులు ప్రభుత్వం నుంచి రీయింబర్స్‌మెంట్ అయ్యేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. స్థానికుల విన్నపం మేరకు రామాలయ నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

లోకేష్‌ది పాదయాత్ర కాదు విహారయాత్ర

14 ఏళ్ల పరిపాలనలో చంద్రబాబు ప్రజలకు మంచి చేయలేదు కాబట్టే ఘోరంగా ఓడిపోయారని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి తెలియజేశారు. నాలుగేళ్ల పరిపాలనతో ప్రతి గ్రామంలో సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం మంచి చేసింది కాబట్టే ధైర్యంగా ప్రజల్లోకి వెళుతున్నామని చెప్పారు. ప్రజలకు ఏమీ చేయని టీడీపీ నాయకులు ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత లేదని ఆయన పేర్కొన్నారు. గురువారం సోమాపురంలో ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ నారా లోకేష్ చేస్తున్నది పాదయాత్ర కాదని, 4వేల మంది పెయిడ్ ఆర్టిస్టులతో విహార యాత్ర చేస్తున్నారని ఆరోపించారు. లోకేష్ పాదయాత్రకు ప్రజాదరణ లేదన్నారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడుకు 175 నియోజకవర్గాల్లో పోటీ చేసే సత్తా లేక పొత్తుల కోసం వెంపర్లాడుతున్నాడన్నారు. 2024 ఎన్నికల్లోనూ టీడీపీకి ఓటమి తప్పదని జోస్యం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ టి.లక్షుమయ్య, సర్పంచ్ శ్రీనివాసులరెడ్డి, మాజీ జెడ్పీటీసీ బాలనరసింహారెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డి, రామాంజునేయులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు మొర్రాయిపల్లెలో..

మండలంలోని మొర్రాయిపల్లె గ్రామంలో శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎంపీపీ తెలిదేల లక్షుమయ్య తెలిపారు. ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులతో కలసి ఇంటింటి తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారన్నారు. అన్ని శాఖలకు చెందిన అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఎంపీపీ కోరారు.

గ్రామాలను సస్యశ్యామలం చేస్తా



అర్కటవేములలో రూ.5 లక్షల నగదును పంపిణీ చేస్తున్న నారాయణరెడ్డి చిత్రంలో ఎమ్మెల్యే రాచమల్లు

రాజుపాళెం : ప్రొద్దుటూరు నియోజకవర్గంలో ఏగ్రామంలో ఫ్యాక్షన్ ఉండకూడదనేది నా ఉద్దేశమని.. గ్రామంలో అందరూ కలిసిమెలసి ఉండాలి. అభివృద్ధి కోసం కలిసి కట్టుగా ఉండాలి. టీడీపీ నాయకులకు చెప్పేది ఒక్కటే.. మీరు, నేను కలిసి గ్రామాలను సస్యశ్యామలం చేద్దాం అని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి అన్నారు. మండలంలోని అర్కటవేముల గ్రామంలోని చర్చి వద్ద గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఐదేళ్లకు వచ్చే ఎన్నికలలో ప్రజలకు ఎవరు నచ్చితే వారికి ఓటు వేస్తారని తెలిపారు. టీడీపీ నేతలు తనపై బురద చల్లే పనులు మానుకోవాలని హితవు పలికారు. టీడీపీ ప్రభుత్వంలో మా నాయకులపై తప్పుడు కేసులు పెట్టారని గుర్తు చేశారు. ఇప్పుడు మా ప్రభుత్వం అధికారంలో ఉంటే ఏ ఒక్క టీడీపీ వారిపై తప్పుడు కేసు పెట్టలేదన్నారు.

స్మశాన స్థలం కోసం రూ.5 లక్షలు విరాళం

గతంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎస్సీ కాలనీ వాసులు తమకు స్మశాన స్థలం లేదని గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు సిద్ది రమణారెడ్డి ద్వారా తనను కలిశారని ఎమ్మెల్యే తెలిపారు. కాలనీ వాసులు స్మశానానికి స్థలం కొనుక్కునేందుకు డబ్బు ఇప్పించాలని తనను కోరారని.. ఆ మేరకు రూ.5 లక్షలు గురువారం విరాళంగా ఇచ్చామని ఆయన చెప్పారు. మండల ఇన్‌చార్జి ఎంపీపీ నారాయణరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు పాతపాటి శివనాగిరెడ్డి, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ గుద్దేటి రాజారాంరెడ్డి, మార్కెట్ యార్డు డైరెక్టర్ సంజీవిగారి శ్రీనివాసులు, సర్పంచులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

నేడు పొట్టిపాడుకు ఎమ్మెల్యే రాక

మండలంలోని పొట్టిపాడుకు గ్రామానికి శుక్రవారం ఎమ్మెల్యే రాచమల్లు రానున్నట్లు గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు ఎంబీ శివశంకర్‌రెడ్డి గురువారం తెలిపారు.

నేడు చంద్రబాబు వ్యాఖ్యలపై ఎమ్మెల్యే రాచమల్లు నిరసన

ప్రొద్దుటూరు : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన అనుచిత వ్యాఖ్యలపై శుక్రవారం ఉదయం 10 గంటలకు స్థానిక మండల రెవెన్యూ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు ఇళ్లు మంజూరు చేశారని పేర్కొన్నారు. సీఎం అడిగిన పేదలందరికి ఇళ్లు మంజూరు చేశారన్నారు. ఈ విషయాన్ని గమనించకుండా ఉద్దేశ పూర్వకంగా చంద్రబాబు... జగన్ ఇచ్చిన ఇంటి స్థలాలు శవాలు పూడ్చుకోవడానికి కూడా సరిపోవని వ్యాఖ్యానించారు. ఇందుకు నిరసనగా మండల రెవెన్యూ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని ఆయన కోరారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా



ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

బద్వేలు అర్బన్ : గోపవరం మండల పరిధిలోని వివిధ గ్రామాల సోమశిల ముంపు వాసులకు పి.పి.కుంట సమీపంలోనే ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ గురువారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శివకుమార్, అన్వేష్‌లు మాట్లాడుతూ పి.పి.కుంట సమీపంలో హైవే రోడ్ల విస్తరణలో నష్టపోతున్న బాధితులకు ఇళ్ల స్థలాలు కేటాయించడంతో పాటు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే సోమశిల ముంపు నిర్వాసితులకు కూడా ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు డి.వెంకటేష్, భూపోరాట సాధన సమితి మండల నాయకులు ఖాదర్‌బాషా, కదిరయ్య, సీపీఎం నాయకులు చాంద్‌బాషా, రమణయ్య, రాజు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన

ప్రొద్దుటూరు : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో ఉన్న పుట్టపర్తి నారాయణాచార్యులు ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా గురువారం విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. డాక్టర్లు విజయనాగేంద్ర, చక్రధర్, కె.ఖాజాహుస్సేన్ మాట్లాడుతూ ఒక వ్యక్తి పడిపోయినప్పుడు పలకరించాలని, పలకనప్పుడు శ్వాస, రక్తనాళాలను చూడాలని తెలిపారు. అంబులెన్స్‌కి కాల్ చేయాలి, ఈలోపు ఆ వ్యక్తికి సీపీఆర్ చేయాలని సూచించారు. చెస్ట్ బోన్‌పై ఎడమ చేతిని కింద పెట్టి దానిపైన కుడి చేయి పెట్టి, మోచేతులను స్ట్రైట్‌గా పెట్టి భుజాలను కదిలించకుండా ప్రెస్ చేయాలన్నారు. ఈ విధంగా నిమిషానికి 100 నుంచి 120 సార్లు ప్రెస్ చేయాలని సూచించారు. గుండెను ఆరోగ్యవంతంగా ఉంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి తిరుపతమ్మ, రోటరీక్లబ్ ప్రెసిడెంట్ రామకృష్ణ, సెక్రటరీ బాలసూర్యారావు, ఆర్టీపీపీ డీఈ ప్రభాకర్‌రెడ్డి, జేవీవీ చంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు



ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న అర్బన్ సీఐ వెంకటేశ్వర్లు

బద్వేలు అర్బన్ : ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించే ఆటోడ్రైవర్లపై కఠినచర్యలు తీసుకుంటామని అర్బన్ సీఐ జి.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. స్థానిక అర్బన్ స్టేషన్ ఆవరణలో గురువారం ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను చేరవేయరాదని, ప్రతి డ్రైవర్ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. డ్రైవర్ సీటు పక్కన అదనపు సీట్లు ఏర్పాటు చేసినా, ఆటోలో సౌండ్ సిస్టం ఏర్పాటు చేసినా సంబంధిత ఆటోలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. త్వరలోనే పోలీసుశాఖ తరపున ఆటోలకు నెంబర్లు కేటాయిస్తామన్నారు. కార్యక్రమంలో అర్బన్ ఎస్ఐ కత్తి వెంకటరమణ, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

నేడు నాగులపల్లెలో ఫ్యామిలీ డాక్టర్

చాపాడు : మండల పరిధిలోని ఖాదర్‌పల్లె గ్రామ సచివాలయ పరిధిలోని నాగులపల్లె గ్రామంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్ కుమార్ తెలిపారు. గ్రామాలలో ఉదయం 9:30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగే వైద్య శిబిరంలో అన్ని రకాలైన వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేస్తారన్నారు. అవకాశాన్ని గ్రామస్తులు వినియోగించుకోవాలని వైద్యాధికారి కోరారు.

విద్యుత్ ప్రమాదం జరగకుండా జాగ్రత్తలు తీసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎస్‌పీడీసీఎల్ డీఈఈ విజయకుమార్‌రెడ్డి

కలసపాడు : విద్యుత్ ప్రమాదాలు జరగకుండా విద్యుత్ సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీఎస్‌పీడీసీఎల్ డీఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక సబ్‌స్టేషన్‌లో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులు రక్షణ చర్యలు పాటించకుండా మరమ్మతు పనులు చేయకూడదన్నారు. అలాగే మండలంలో విద్యుత్ పాత బకాయిలను వసూలు చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. అధిక లోడు ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించి త్రీఫేస్ ట్రాన్స్‌ఫార్మర్లపై లోడును సరి చేయాలని సూచించారు. సమావేశంలో అసిస్టెంట్ ఇంజినీర్ కె.బ్రహ్మానందరెడ్డి, లైన్‌మెన్ గోపాలకృష్ణ, అసిస్టెంట్ లైన్‌మెన్ శివయ్య, జూనియర్ లైన్‌మెన్ సంజీవరాయుడు, ఎనర్జీ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక బొల్లవరం సమీపంలోని జగనన్న కాలనీలో పనిచేస్తున్న బేల్దారి కార్మికులకు వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సర్వోదయ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ (సిర్డ్) ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. సొసైటీ అధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని, వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్మికులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు రెబకా, రమణమ్మ, చంద్ర ఓబుళరెడ్డి పాల్గొన్నారు.

అభాగ్యురాలికి అంత్యక్రియలు



నారాయణమ్మ మృతదేహాన్ని అంత్యక్రియలకు తరలిస్తున్న సంస్థ ప్రతినిధులు

కాశినాయన : ఎవరూ లేని అభాగ్యురాలికి ఆ సంస్థ యువకులు ఆత్మబంధువులయ్యారు. కాటి వరకు సాగనంపి మానవత్వాన్ని చాటుకున్నారు. మండలంలోని నరసాపురం గ్రామానికి చెందిన పాలకొలను నారాయణమ్మ (45) గురువారం మృతి చెందింది. చాలా ఏళ్ల క్రితం భర్త వదిలేశాడు. కూలీ నాలీ చేసుకుంటూ జీవనం సాగించేది. గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం రాత్రి మృతి చెందింది. బంధువులు ఉన్నా అంత్యక్రియలు చేసేందుకు ముందుకు రాలేదు. దీంతో స్థానికులు వివేకానంద ఫౌండేషన్ సంస్థ వ్యవస్థాపకుడు పి.రామకృష్ణారెడ్డికి సమాచారం అందించారు. సంస్థ ప్రతినిధులు రామతులసి, ప్రభాకర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, ప్రసాద్‌లు గ్రామానికి చేరుకుని నారాయణమ్మకు సంప్రదాయ పద్ధతితో అంత్యక్రియలు నిర్వహించారు.

సుబ్బన్న మృతి కళాకారులకు తీరని లోటు



సుబ్బన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కళానికేతన్ సభ్యులు

బద్వేలు అర్బన్ : అన్నమాచార్య కళానికేతన్ వ్యవస్థాప అధ్యక్షుడు, తబలా విద్వాంసుడు ఎద్దుసుబ్బన్న మృతి కళాకారులకు తీరని లోటని కళానికేతన్ ప్రధాన బాధ్యులు ఎం.సునీల్‌కుమార్, కె.ఓబులేసు, వ్యవస్థాపక కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.ఎస్.దావూద్‌లు పేర్కొన్నారు. గురువారం స్థానిక అన్నమాచార్య కళానికేతన్ కార్యాలయంలో నిర్వహించిన సుబ్బన్న సంతాపసభలో వారు మాట్లాడుతూ బద్వేలుతో పాటు వివిధ ప్రాంతాల్లో ఎంతో మంది కళాకారులను తయారు చేసిన కళాహృదయుడు సుబ్బన్న అని కొనియాడారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళానికేతన్ సభ్యులు శ్రీనివాసులు, వినయ్‌కుమార్, శర్మ, డేవిడ్, కొండయ్య, శ్రీనివాసులువర్మ, సుబ్బన్న శిష్యులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



చల్లటి నీరు అందిస్తున్న ఎస్ఐ

కాశినాయన : మండల కేంద్రమైన నరసాపురం పోలీసుస్టేషన్ ఆవరణలో జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు స్థానిక ఎస్ఐ హరిప్రసాద్ గురువారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు ఎండాకాలంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు క్రైం : చలివేంద్రాల ఏర్పాటుతో ప్రజల దాహార్తి తీరుతుందని టూ టౌన్ సీఐ ఇబ్రహీం తెలిపారు. జిల్లా ఎస్పీ అన్బురాజన్ ఆదేశాల మేరకు ఏఎస్పీ ప్రేరణాకుమార్ ఆధ్వర్యంలో పట్టణంలోని అన్ని స్టేషన్‌ల పరిధిలో గురువారం చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా టూ టౌన్ పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో సీఐ ఇబ్రహీం చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రతి రోజు మంచినీరు, చల్లని మజ్జిగ ప్రజలకు అందిస్తున్నట్లు తెలిపారు.

గ్రంథాలయాలను ఉపయోగించుకోవాలి



గ్రంథాలయంలో అభిప్రాయాన్ని నమోదు చేస్తున్న నాగార్జునరెడ్డి

బద్వేలు : గ్రంథాలయాలను యువకులు, విద్యార్థులు విరివిగా ఉపయోగించుకోవాలని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి రాష్ట్ర సలహాదారు నాగార్జున రెడ్డి పేర్కొన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆయన గురువారం పోరుమామిళ్లలోని గ్రంథాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన పాఠకులతో మాట్లాడారు. రచయిత డాక్టర్ ప్రభాకర్ అందించిన పుస్తకాలను గ్రంథాలయానికి వితరణగా అందజేశారు. పోరుమామిళ్ల-1, 3 సచివాలయాలను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. సిబ్బంది పారదర్శకంగా విధులు నిర్వర్తించాలని తెలిపారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

దువ్వూరు : మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా గురువారం చెస్, క్యారమ్స్ ఆటల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయ శాఖ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. స్పోకెన్ ఇంగ్లిష్‌ను సులభంగా నేర్చుకునే విధానంపై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. విద్యార్థులచే కథల పుస్తకాలు చదివించారు.

తొగటవీర క్షత్రియ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ప్రొద్దుటూరు కల్చరల్ : నియోజకవర్గ పరిధిలో 10వ తరగతిలో ప్రతిభ కనపరచిన తొగటవీర క్షత్రియ విద్యార్థినీ విద్యార్థులకు ప్రతిభకు పట్టాభిషేకం నిర్వహించనున్నట్లు తొగటవీరక్షత్రియ ఉద్యోగులు, వృత్తినిపుణుల సంక్షేమ సేవాసంఘం అధ్యక్షుడు బి.రామాంజినేయులు తెలిపారు. స్థానిక వసంత పేటలోని తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాటాడుతూ ప్రొద్దుటూరు, రాజుపాళెం మండలాల్లో ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్, ఎయిడెడ్ పాఠశాలల్లో 10వ తరగతి చదివి అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు ఈ పురస్కారాలకు అర్హులన్నారు. విద్యార్థినీ విద్యార్థులకు ప్రథమ బహుమతిగా రూ.5000, ద్వితీయ బహుమతిగా రూ.3000, తృతీయ బహుమతిగా రూ.2000 అందచేస్తామన్నారు. అలాగే పలువురు విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందచేస్తామని తెలిపారు. జూన్ 10వ తేదీ లోపల అర్హులైన తొగటవీర క్షత్రియ విద్యార్థులు తమ దరఖాస్తులను తొగటవీర క్షత్రియ ఉద్యోగులు, వృత్తి నిపుణుల సంక్షేమ సేవా సంఘం కార్యాలయంలో అందచేయాలని కోరారు. వీరికి జూన్ 18వ తేదీన ఉదయం ప్రతిభా పురస్కారాలు అందిస్తామని తెలిపారు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణమూర్తి, ట్రెజరర్ లక్ష్మీనరసయ్య, జాయింట్ సెక్రటరీ శివనాగయ్య, నాగరాజు, భాస్కర్, మునిస్వామి, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలను గుర్తించి చర్యలు తీసుకోండి



బి.మఠం : స్పందనలో సమస్యలు వింటున్న అధికారులు



బేతాయపల్లెలో వినతులు స్వీకరిస్తున్న ఎంపీడీఓ



చాపాడు : స్పందనలో పాల్గొన్న అధికారులు

బ్రహ్మంగారిమఠం : రేకులకుంట పంచాయతీలో గత ప్రభుత్వంలో ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ భూములను ఆన్‌లైన్ చేయించుకున్న వారి నుంచి భూములు స్వాధీనం చేసుకోవాలని ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి కోరారు. గురువారం మండలంలోని రేకులకుంట గ్రామ పంచాయతీలో ట్రైనీ కలెక్టర్ రాహుల్ మీనా ఆధ్వర్యంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సి.వీరనారాయణ రెడ్డి మాట్లాడుతూ ఈ గ్రామ పంచాయతీలో గత ప్రభుత్వంలో అనధికారికంగా ప్రభుత్వ భూములను చాలా మంది ఆన్‌లైన్ చేయించుకున్నారని తెలిపారు. అటువంటి భూములను గుర్తించి రద్దు చేయాలని చెప్పారు. చాలా మంది నిరుపేదలు అనుభవంలో ఉన్న భూమికి అప్పట్లో ప్రభుత్వం ఎలాంటి అనుమతులు మంజూరు చేయలేదన్నారు. అప్పటి రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్ చేయడానికి చేతివాటం ప్రదర్శించారన్నారు. ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి ప్రతి నిరుపేదకు భూమి ఉండేలా చొరవ చూపుతున్నారని, జరగబోయే అసైన్‌మెంట్ కమిటీలో భూమి లేని నిరుపేదలతోపాటు అనుభవంలో ఉన్న వారికి పట్టాలు మంజూరు చేస్తారని తెలిపారు. అధికారులు స్పందించి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా భూములు ఉన్నవారిపై చర్యలు తీసుకోవాలన్నారు. స్పందించిన ట్రైనీ కలెక్టర్ రాహుల్ మీనా ప్రభుత్వం భూ రీ సర్వే చేస్తోందని, అందులో ప్రతి అనుభవదారుడిని గుర్తిస్తామని తెలిపారు. కలెక్టర్, జేసీ, ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ప్రతి నిరుపేదకు అసైన్‌మెంట్ కమిటీలో భూమి వచ్చేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి నరసింహారెడ్డి, తహసీల్దార్ ఈశ్వరయ్య, ఎంపీడీఓ వెంగమునిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు రాజానాయుడు, అధికారులు పాల్గొన్నారు.

గోపవరం : గ్రామ సచివాలయాల్లో నిర్వహించే స్పందన కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. గురువారం మండలంలోని బేతాయపల్లె సచివాలయంలో సచివాలయ సిబ్బందితో కలిసి అన్నిశాఖల అధికారులు స్పందన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ హరినారాయణ మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా అధికారుల దృష్టికి తీసుకువస్తే 24 గంటలలోపు సమస్యను పరిష్కరిస్తామన్నారు. స్పందనలో ఇచ్చే ప్రతి అర్జీకి రసీదు ఇవ్వడంతో పాటు పరిష్కారం కూడా అంతే వేగంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ చిట్టిబాబు, ఈఓపీఆర్‌డీ హసీనా, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులరెడ్డి, ఏపీఎం శివప్రసాద్, ఏపీఎస్‌పీడీసీఎల్ ఏఈ చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే స్పందన

చాపాడు : ప్రతి గ్రామంలో ప్రజా సమస్యల పరిష్కారానికి గ్రామ సచివాలయాల్లో ప్రత్యేక స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామని మండల ప్రత్యేకాధికారి సురేష్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వెదరూరు గ్రామ సచివాలయంలో గురువారం స్పందన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న ప్రభుత్వ పరమైన సమస్యలను స్పందనలో ప్రజలు అధికారుల దృష్టికి తీసుకురావచ్చన్నారు. ప్రతి సమస్యకు తక్షణమే పరిష్కారం చూపిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడు, ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, డ్వాక్రా ఏపీఎం వెంకటరమణ, ఉపాధి ఏపీఓ పద్మారాణి, హౌసింగ్ ఏఈ మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.